ఏలూరులో టీడీపీ బెదిరింపుల పర్వం

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి ఆకర్షిస్తున్న వైనం
- టీడీపీ నేతలు, కార్యకర్తల్లో చాపకింద నీరులా అసంతృప్తి
- భవిష్యత్తుపై మథనపడుతున్న టీడీపీ క్యాడర్


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్)

ఏలూరు టౌన్‌: ఏలూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఏలూరు నగరపాలక సంస్థను కైవసం చేసుకునేందుకు టీడీపీ నేతలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లో బెదిరింపులకు పాల్పడి మెజారిటీ కార్పొరేటర్లను టీడీపీ గూటికి చేర్చటంలో నేతలు సఫలీకృతులయ్యారు. భవిష్యత్తు రాజకీయ పరిస్థితులపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోని నేతలు, కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారంలో లేని విపత్కర పరిస్థితుల్లో టీడీపీని భుజాలపై ఎత్తుకుని పోరాటం చేశామని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకోవడంపై టీడీపీ శ్రేణులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీలోని కొందరు కార్పొరేటర్లను భయపెట్టినా పార్టీ వీడేదిలేదని, కక్ష సాధింపు చర్యలకు దిగినా టీడీపీలో చేరబోమని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. రాబోయే కార్పొరేషన్‌ ఎన్నికలు కూటమి ప్రభుత్వానికి తలనొప్పిగా మారటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పదవులను కాపాడుకునేందుకు..

ఏలూరు నగరపాలక సంస్థలో ఆధిపత్యం కోసం టీడీపీ బెదిరింపుల పర్వానికి తెరతీస్తే, మరోవైపు ఉన్న పదవులను కాపాడుకునేందుకు కార్పొరేటర్లు బేరసారాలకు దిగుతున్నారు. కార్పొరేషన్‌ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల గడువు ఉండడంతో పదవుల్లోనే ఉంటూ తమ పబ్బం గడుపుకోవాలనే ఆలోచనలో కార్పొరేటర్లు ఉన్నారు. ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్లనాని వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయడంతో దిక్కులేని స్థితిలోనే పార్టీ మారుతున్నామని, టీడీపీ నేతలు వ్యక్తిగతంగా తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడేందుకు సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. అవసరమైతే తప్పుడు కేసులు బనాయించి అయినా వేధించేందుకు టీడీపీ నేతలు సిద్ధపడడం గమనార్హం.

పదవులకు రాజీనామా చేయాలి

ఏలూరు నగరపాలక సంస్థలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు వేధింపులు ప్రారంభమయ్యాయి. ఏలూరు నగర మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌, కోఆప్షన్‌ సభ్యులు ఎస్‌ఎంఆర్‌ పెదబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పదవులు చేపట్టటంతో వారిపై ఒత్తిడి తెచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే టీడీపీతో లోపాయికారి ఒప్పందం మేరకే మేయర్‌ పదవిని వారికే వదిలేసినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇద్దరు డిప్యూటీ మేయర్లను సైతం పదవులకు రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కోఆప్షన్‌ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్‌ తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డితోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

మథనపడుతున్న టీడీపీ నేతలు

ఏలూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, శ్రేణుల్లో చాప కిందనీరులా అసంతృప్తి జ్వాలలు రగులుకుంటున్నాయి. ఏలూరులో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నేతలను టీడీపీ కూటమిలో చేర్చుకోవటంపై వారంతా మథనపడుతున్నారు. మరో రెండేళ్లలో కార్పొరేషన్‌ ఎన్నికలు నిర్వహించనున్న తరుణంలో ప్రాధాన్యత దక్కే అవకాశం లేదనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి డివిజన్‌లో వారికే కార్పొరేటర్‌ సీటు ఉంటుందని చెబుతున్నా... తీరా ఎన్నికల నాటికి రిక్తహస్తం ఇవ్వరనే నమ్మకం ఏమిటనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి డివిజన్‌లోనూ కూటమి నేతలు ఐదు నుంచి 10మంది వరకూ ఉంటే, మళ్లీ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను చేర్చుకోవటంపై వారంతా ససేమిరా అంటున్నారు. సోషల్‌ మీడియాలో సైతం టీడీపీ క్యాడర్‌ నేతల నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలువురు పోస్టులు పెట్టడం చర్చనీయాంశమైంది.

వైఎస్‌ జగన్‌తోనే కొనసాగుతా



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్‌ ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్‌ సభ్యుడిగా రాజీనామా చేశానని తెలిపారు. టీడీపీ ఒత్తిడితో కోఆప్షన్‌ సభ్యుడిగా రాజీనామా చేశానని, పార్టీలోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటామని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి పేదవానికీ మేలు జరిగిందని, కేవలం రాజకీయాల కోసం పార్టీ మారే ఆలోచన లేదని తెలిపారు.

– మున్నుల జాన్‌గురునాథ్‌, మాజీ కోఆప్షన్‌ సభ్యులు

ఆరోగ్యవంతమైన సమాజానికి వ్యాయామం దోహదం


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏలూరు సీసీఎస్‌ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్‌: యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటంలో భాగస్వాములు కావాలని ఏలూరు సీసీఎస్‌ సీఐ సీహెచ్‌ మురళీకృష్ణ అన్నారు. ఏలూరు సర్‌ సీఆర్‌ఆర్‌ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి ఏలూరు ఫైర్‌స్టేషన్‌ సెంటర్‌ సమీపంలో రఘు ఫిట్‌నెస్‌ జోన్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీసీఎస్‌ సీఐ మురళీకృష్ణ విజేతలకు పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ప్రతి రోజూ వ్యాయామం చేయటం ద్వారా మంచి శారీరక సౌష్టవంతో పాటు ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. యువత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. పోటీల్లో గెలుపు, ఓటములు సహజమేనని, కానీ విజయానికి నిరంతర శ్రమ, లక్ష్యసాధన అవసరమని చెప్పారు. యువత విలాసాలు, జల్సాలు, మద్యం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రఘుపవన్‌, రహ్మత్‌ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మోక్షగుండం స్ఫూర్తితో సేవలందించాలి


విద్యుత్‌ ఎస్‌ఈని సన్మానిస్తున్న ఈపీడీసీఎల్‌ ఇంజనీర్లు, అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా భారతరత్న అవార్డు ఇచ్చారని, ఆయన స్ఫూర్తితో అందరూ పని చేయాలని విద్యుత్‌ శాఖ సర్కిల్‌ సూపరింటెండింగ్‌ ఇంజనీర్‌ పి.సాల్మన్‌ రాజు అన్నారు. మోక్షగుండం జయంతి సందర్భంగా స్థానిక విద్యుత్‌ భవన్‌లో ఇంజనీర్స్‌ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఈ సాల్మన్‌ రాజుని ఈపీడీసీఎల్‌ ఇంజనీర్లు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆపరేషన్‌ జేపీబీ నటరాజన్‌, టీ.శశిధర్‌, కే.సత్యకిషోర్‌, నాయకులు తురగా రామకృష్ణ పాల్గొన్నారు. ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు యన్‌ రఘుబాబు, కే. రమేష్‌, కే. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 23వ వార్షిక పవిత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అ సందర్భంగా అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ఆధ్వర్యంలో పవిత్ర అధివాస పూజ చేసి అంకురార్పణ, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

డిగ్రీ కళాశాలకు ఫ్యాన్ల వితరణ


డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న దాత ఎల్‌ వెంకటేశ్వర రావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆ కళాశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఎల్‌ వెంకటేశ్వరరావు 5 ఫ్యాన్లు అందజేశారు. ఆదివారం కళాశాలలో ప్రిన్స్‌పాల్‌ గుత్తా గిరిబాబుకు ఈ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో వసతుల కల్పనకు, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత మంది దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు పీవీ రమణ, మాజీ అధ్యక్షుడు కేబీ రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్‌): కొల్లేరు వరద వల్ల వేలాది ఎకరాలు చేపలు,రొయ్యల చెరువులు ముంపునకు గురై నష్టపోయిన ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు వరదల వల్ల ఆక్వా రైతులకు భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ఏలూరు రూరల్‌, కైకలూరు, మండవల్లి, పెదపాడు తదితర మండలాల్లో ఆక్వా చెరువులకు ఎక్కువ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇప్పటికే ఆక్వా రైతులు తీవ్రనష్టాల్లో ఉన్నారని భారీ వర్షాల వల్ల వచ్చిన వరదల వల్ల మరింత ఎక్కువగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ఆక్వా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ కొల్లేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్పీఐ రాష్ట్ర కార్యదర్శిగా మత్తే బాబి

ఏలూరు (టూటౌన్‌): రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన మత్తే బాబిని నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఏలూరు వన్‌ టౌన్‌లో రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గం ఆదేశాల మేరకు పార్టీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్‌ సంయుక్తంగా మత్తే బాబికి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర నాయకత్వానికి బాబి ధన్యవాదాలు తెలిపారు.

ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించాలి



ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రాఫిక్‌ సార్జెంట్‌ వెంకటేష్‌

ఏలూరు టౌన్‌: ఏలూరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ సార్జెంట్‌గా ఆర్‌ఎస్‌ఐ వెంకటేష్‌ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌ను ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్‌ నిబంధనలు పాటించేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్‌ ధరించాలని చెప్పారు. కారులో ప్రయాణించేవారు సైతం డ్రైవర్‌, ముందు సీట్లో ఉన్న వ్యక్తులు సీటు బెల్టు ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌ రద్దీ పెరిగిపోతూ ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితులను నివారించేందుకు చర్యలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు.

అన్నదాతలకు అందని ప్రభుత్వ సాయం

- వరదల కారణంగా పంటలకు తీవ్రనష్టం
- నేటికీ అమలుకాని అన్నదాత సుఖీభవ పథకం
- పంటల బీమా పరిహారం ఊసేలేదు
- ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలు


జాలిపూడి పరిసరాల్లో ముంపుబారిన పడిన చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఏలూరు రూరల్‌: వరద కారణంగా పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయిన ఏలూరు రూరల్‌ గ్రామాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ముంపు బారిన పడిన చేలు మళ్లీ బతికే పరిస్థితి లేకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. సాగు కోసం అప్పులు చేసి, అధిక వ్యయం వెచ్చించి నష్టపోయామని అన్నదాతలు అంటున్నారు. మళ్లీ సాగు చేయాలంటే ప్రభుత్వం సహాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ముంపుబారిన పడిన చేలను శాస్త్రవేత్తలు, అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. నష్ట పరిహారం ఎంత ఇస్తారు, ఎప్పుడిస్తారో చెప్పడం లేదని వారన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు రైతు భరోసా పథకం ద్వారా ఆదుకుందని వారు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదని వాపోయారు.

లక్షల పెట్టుబడి వరదపాలు

వరదలు రైతుల కష్టంతో పాటు పెట్టుబడి కూడా నీటి పాలు చేశాయి. ఖరీఫ్‌లో సాగుకు రైతులు రూరల్‌ మండలం పరిధిలో 234 క్వింటాలు విత్తనాలు కొనుగోలు చేశారు. దుక్కదున్ని నేలను చదును చేయడం, విత్తనాల కొనుగోలు, నారు పోయడం, నాట్లు వేయడం కోసం ఎకరానికి సుమారు రూ.16 వేలు ఖర్చు చేశారు. జాలిపూడి, మల్కాపురం, కోటేశ్వరదుర్గాపురం, మాదేపల్లి శివారు ప్రాంతాల్లో వరదల కారణంగా ముంపుబారిన పడిన పంట చేలు ఇప్పుడు తేరుకుంటున్నాయి. ఈ చేలల్లో మళ్లీ సాగు పనులు చేపట్టాలని ఇది మరింత భారమవుతుందని రైతులు అంటున్నారు. తెగుళ్ల సోకకుండా మందుల పిచికారీ, ఎరువులు వేయడానికి వేల రూపాయల వ్యయం అవుతుందని రైతులు అంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి సాయం అందకపోతే సాగుకు ముందుకు కదిలే పరిసస్థితి లేదని వారంటున్నారు.

పథకాల పేరు మార్పుకే పరిమితమైన ప్రభుత్వం

ఖరీఫ్‌ సాగు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతులకు పంట సాయం అందించలేదు. నేడు కూటమి ప్రభుత్వం వైఎసస్సార్‌ రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. ఎకరానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చింది. దీనిని అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వం వైఎసార్‌ రైతు భరోసా పథకంతో సాగుదారులకు ఏడాదికి రూ.13,500 సాయం అందించింది. జులై నెలాఖరు లేదా ఆగసస్టు మొదట వారంలో రైతుల బ్యాంక్‌ ఖాతాల్లో నేరుగా నగదు జమ అయ్యేవి. 2019–2020లో 2,896 మంది రైతులకు రూ.3,90,96,000, 2020–2021లో రూ.3,93,52,000, 21–22లో 2,727 మంది రైతులకు రూ.3.68 కోట్లకు పైగా అందించారు. 22–23లో 2,623 మందికి 3.54 కోటట్లు, ఆఖరి సంవత్సరంలో 2,614 మంది సాగుదారులకు రూ. 3.23 కోట్లు వైఎసస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. మొత్తంగా ఐదేళ్లలో 18.30 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. నేటీ టీడీపీ ప్రభుత్వం రైతుకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు.

పంటల బీమా పరిహారం అందించాలి

వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట చేలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు పంట నష్టాలను నమోదు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి. వాస్తవాల ఆధారంగా సాగుదారులైన కౌలురైతుల పేర్లతో నష్టాన్ని నమోదు చేయాలి. ముంపు బారిన పడిన పంటలకు బీమా పరిహారం అందించాలన్నారు.

– కె శ్రీనివాస్‌, రైతు సంఘం నాయకులు

ముగిసిన గణపతి నవరాత్రి మహోత్సవాలు


కుండీ సెంటర్‌లో ప్రత్యేక పూజలు అందుకున్న భారీ గణపతి


43వ డివిజన్‌లో శాకంబర అలంకరణలో గణనాథుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో గణపతి నవ రాత్రి మహోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఆయా ప్రాంతాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక అమీనాపేటలోని దాసాంజనేయ స్వామి దేవాలయం వద్ద వినాయక గుడి సమీపంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సురేష్‌ చంద్ర బహుగుణ స్కూల్‌ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ కే. ప్రతాప్‌ శివ కిషోర్‌ ఆదేశాలపై ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అదనపు ఎస్పీ, అడ్మిన్‌ ఏఆర్‌ అదనపు ఎస్పీ ఎన్‌ఎస్‌ఎస్‌ శేఖర్‌, ఏఆర్‌ డీఎస్పీ శ్రీహరి, పవన్‌కుమార్‌ ఇతర పోలీసు అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్‌ అధికారులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో భారీ అన్న సమారాధన

స్థానిక 43వ డివిజన్‌ బావిశెటి వారి వీధిలో గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించిన కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి శాకంబర అలంకరణ చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నూకాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్‌ కరణం రాజు (ఇసుక రాజు), సోషల్‌ వర్కర్‌ గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు. సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో స్వామి వారికి మోదుకార్చన నిర్వహించారు. రామకోటి ప్రాంగణంలో భారీ గణపతికి తామర పువ్వులతో విశేష అర్చన నిర్వహించారు. ఎస్‌ఎస్‌ కూరగాయల మార్కెట్‌ వద్ద స్వామి వారికి శాకంబర అలంకరణ చేశారు. కుండీ సెంటర్‌లోని భారీ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి నగరంలో భారీ ఊరేగింపు నడుమ స్వామి వార్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. నగరంలో అన్ని గణపతి ప్రతిమలను ఊరేగించనున్నారు.

ప్రవక్త చూపిన శాంతి మార్గంలో పయనించాలి


ముస్లింల ర్యాలీని ప్రారంభిస్తున్న అహలె సున్నత్‌వల్‌ జమాత ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహమ్మద్‌ ప్రవక్త జన్మదినమైన మిలాద్‌ ఉన్‌ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన అహలే సున్నత్‌ వల్‌ జమాత్‌ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం యువత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అలూకలరి సీతారామ రాజు స్టేడియం వద్ద ఉన్న షాదీ ఖానా వద్ద నుంచి ర్యాలీని సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్‌ హుస్సేన్‌ మాట్లాడుతూ లోక కలల్యాణం, విశ్వశాంతి కోసం ప్రవక్త ప్రజలకు శాంతి మార్గాన్ని చూపారని, ప్రతి ఒక్కరూ ప్రవక్త చూపిన దారిలో పయనించాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల వారిని గౌరవించి సోదరభావంతో ఆదరించాలని, సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పి, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక నిలవాలని సూచించారు. మిలాద్‌ ఉన్‌ నబీ సందర్భంగా సోమవారం స్థానిక కర్బలా మైదానంలో సోమవారం సాయంత్రం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని, ఈ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముహమ్మద్‌ ఖాసిమ్‌ రజా ఆధ్యాత్మిక ప్రసంగం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తామని తెలిపారు. ఈ ర్యాలీ స్థానిక తంగెళ్ల మూడి, ఖండ్రిక గూడెం, అశోక్‌నగర్‌, ఫైర్‌ స్టేషన్‌ సెంటర్‌, జ్యూట్‌మిల్లు, వసంత మహల్‌ సెంటర్‌, పాతబస్టాండు మీదుగా తిరిగి స్టేడియం వద్దకు చేరుకుంది. అహలె సున్నత్‌వల్‌ జమాత్‌ సంస్థ కార్యదర్శి ఎండీ గాలబ్‌ అలీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్‌, ఎండీ ఉస్మాన్‌ దొలా పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై అశ్రద్ధ తగదు


నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రత్నప్రసాద్‌ తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళ్లకు వచ్చే జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దని, అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్‌ సూచించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉషా గ్రూప్‌ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సౌజన్యంతో ఏలూరు లయన్స్‌ క్లబ్‌ విజన్‌ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమవరానికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్య బృందం శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 126 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా వారిలో 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్స చేయడానికి వేమవరం ఆసుపత్రికి తరలించారు. శిబిరానికి హాజరైన వారిలో 27 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు అందజేశారు. అవసరం ఉన్నవారికి ఐ డ్రాప్స్‌, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దీనితో పాటు వినికిడి లోపం ఉన్న ఒక వృద్ధునికి వినికిడి యంత్రాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్‌ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు మల్లవల్లి చలపతిరావు, కడియం ప్రసాద్‌, బచ్చు విష్ణు, లయన్స్‌ సభ్యులు, సామాజిక కార్యకర్తలు చెన్నా వెంకటరామయ్య, మేతర అజయ్‌ బాబు, బి.విఠల్‌ పాల్గొన్నారు.

విశ్రాంత ఇంజనీర్లకు సత్కారం

ఏలూరు (టూటౌన్‌): ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని విశ్రాంత ఇంజనీర్లు కొల్లి రాజశేఖర రావు, ముక్కామల వెంకట కృష్ణారావును సీనియర్‌ సిటిజన్స్‌ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ యస్‌వివియస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ సమాజంలో అత్యున్నత సేవలు అందించిన ఇద్దరు విశ్రాంత ఇంజనీర్లను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇసీఐయల్‌, హైదరాబాద్‌లో డీజీఎంగా పనిచేసిన కొల్లి రాజశేఖర రావు, నీటిపారుదల శాఖలో సూపరింటెండెంట్‌ ఇంజనీరుగా పనిచేసి రిటైర్డ్‌ అయిన ముక్కామల వెంకట కృష్ణారావును ఘనంగా సత్కరించారు. బాపినీడు చౌదరి,శివరామ కృష్ణారావు, పి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వడ్లపట్ల నారాయణరావు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి హేయమైన చర్య

ఏలూరు (టూటౌన్‌): అనంతపురం జిల్లా కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి హేయమైన చర్యగా ఏలూరు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడు గుర్రాల రవికుమార్‌ ఆదివారం అభివర్ణించారు. దళిత మహిళ గోవిందమ్మ కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కోపంతో ఆమెను వందలాది మంది చూస్తుండగా వివస్త్రను చేసి విద్యుత్‌ స్తంభానికి కట్టి కొట్టడం బాధాకరమని అన్నారు. తక్షణమే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. హోంమంత్రి దీనిపై వెంటనే స్పందించాలని కోరారు.